
సాక్షి
పల్నాడు
ఆదివారం । 11 । ఆగస్టు । 2024



జిల్లా ఎస్పీని కలిసిన జేసీ

నగరంపాలెం: జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ శనివారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఇరువురు బాధ్యతలు స్వీకరించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 5527 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 2120 క్యూసెక్కులు విడుదల చేశారు.

బెల్లం ఊట ధ్వంసం



నిజాంపట్నం: పరిశా వారిపాలెం శివారు లో 300 లీటర్లు, అదవల గ్రామ శివారు పాలరేవులో 600 లీటర్ల బెల్లం ఊట గుర్తించి ధ్వంసం చేసినట్లు నగరం స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో సీఐ ప్రసాద్ తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రతి ఇంట్లో జాతీయ జెండా ఎగరాలి

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని



లక్ష్మీపురం: ప్రతి ఇంట్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడాలని, ప్రతి ఒక్కరూ దేశభక్తితో మెలగాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూని కేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ సబ్ పోస్ట్ ఆఫీస్‌లో అజాదీ కా అమృత్ మహోత్స వంలో భాగంగా 'హర్ ఘర్ తిరంగా 3.0' కార్యక్రమాన్ని మంత్రి శనివారం ప్రారంభిం చారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశంలోని ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఉం డాలని కోరారని గుర్తుచేశారు. రూ.25కే పోస్టాఫీసులో జెండాను అందుబాటులోకి తెచ్చామన్నారు. గుంటూరు పశ్చిమ నియోజక వర్గ శాసనసభ్యురాలు గళ్లా మాధవి మాట్లాడుతూ దేశంలో పుట్టినందుకు అందరం గర్వించాలన్నారు. అనంతరం పోస్ట్ ఆఫీస్ ప్రాంగణంలో అధికారులతో కలిసి పెమ్మసాని మొక్కలు నాటారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ హెడ్ క్వార్టర్స్ ఏపీ సర్కిల్ జగదీష్, చీఫ్ పోస్ట్‌మాస్టర్ ఆఫ్ ఏపీ సర్కిల్ డి.ఎస్.వి.ఆర్.మూర్తి, గుంటూరు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ యలమం దయ్య తదితరులు పాల్గొన్నారు.

బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ శివలక్ష్మి



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివ ర్సిటీ ఎడ్యుకేషన్ బీఓఎస్ (బోర్డ్ ఆఫ్ స్టడీస్) చైర్‌పర్సన్‌గా ఆర్‌వీఆర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ లెక్చరర్ డాక్టర్ గంటా వెంకట శివలక్ష్మిని నియమిస్తూ ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ శివలక్ష్మి ఈ హోదాలో మూడు సంవత్సరాలు కొనసాగను న్నారు. తనను బీఓఎస్ చైర్పర్సన్‌గా నియమిం చిన ఏఎన్‌యూ ఉన్నతాధికారులకు శివలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజ్ఞాచారికి తెలుగు భాషా పురస్కారం

ఈ నెల 18న అమలాపురంలో ప్రదానం



తెనాలిరూరల్: అంత ర్జాతీయ సాహిత్య సం స్థ శ్రీశ్రీ కళావేదిక ప్రదానం చేయనున్న తెలుగు భాషా పురస్కారానికి తెనాలి మండలం కొలకలూ రుకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి ఎంపికయ్యారు. ఈ నెల 18న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లో జరగనున్న కార్యక్రమంలో పురస్కారాన్ని కళావేదిక నిర్వాహకులు ప్రదానం చేయను న్నారు. ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక కావ డంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

రేపు 'ప్రజా సమస్య.. పరిష్కార వ్యవస్థ'

మంగళగిరి: పట్టణంలోని ఈద్గా మైదానంలో సోమవారం 'ప్రజాసమస్య.. పరిష్కార వ్యవస్థ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఉన్నతాధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ తోపాటు ఉన్నతాధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధి కారుల దృష్టికి తీసుకొస్తే తగిన పరిష్కారం చూపుతారని వివరించారు. అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అడ్డగోలు రెవెన్యూ

- తహసీల్దార్ల బదిలీల్లో ఇష్టారాజ్యం
- డెప్యూటేషన్లపై బ్యాన్ ఉన్నా ఐదుగురికి పోస్టింగ్
- సొంత మండలంలో మరొకరు నియామకం
- మనోడేనంటూ పచ్చ నేతల సంబరాలు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రక్షాళన పేరుతో వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోంది. అడిగే వారే లేరన్న అహంతో అన్ని వ్యవస్థలను ఒక్కొక్కటిగా ధ్వంసం చేస్తోంది. తాజాగా రెవెన్యూ శాఖలో తహసీల్దార్ల బదిలీలు చేపట్టారు. ఈ బదిలీల్లో అధికార పార్టీ నాయకుల సిఫార్సులు, ఒక సామాజిక వర్గంపై అంతులేని ప్రేమతో ఏకంగా ప్రభుత్వ నిబంధనలనే చెత్త బుట్టలో పడేశారు. పల్నాడు జిల్లాలో నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కారు.

నరసరావుపేటటౌన్: పల్నాడు జిల్లాలోని రెవెన్యూ శాఖలో తహసీల్దార్ల డిప్యుటేషన్ వ్యవహారం మరింత వివాదాలకు దారి తీస్తోంది. సీసీఎల్ఏ రూల్స్‌కు విరుద్ధంగా సాగిన తహసీల్దార్ల డిప్యుటేషన్లలో అధికార పార్టీ నాయకుల పైరవీలు కనిపిస్తున్నాయి.

సొంత మండలంలో పోస్టింగ్

పల్నాడు జిల్లాలో కొద్ది రోజుల కిందట జరిగిన తహసీల్దార్ల డిప్యూటేషన్లలో సీసీఎల్ఏ రూల్స్‌ను పక్కన పడేశారు. డిప్యూటేషన్లు బ్యాన్ పీరియడ్‌లో ఉన్నప్పటికీ ఇష్టారాజ్యంగా, అధికార పార్టీ నాయకుల చెప్పిన విధంగా మార్చేశారు. పల్నాడు జిల్లాలో డిప్యూటేషన్లపై నరసరావుపేట, చిలకలూరిపేట, ముప్పాళ్ల, నాదెండ్ల, యడ్లపాడు మండలాలకు తహసీల్దార్లను నియమించారు. వీరిలో ప్రధానంగా నరసరావుపేట తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాలరావు పోస్టింగ్‌పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీసీఎల్ఏ నిబంధనల ప్రకారం తమ సొంత రెవెన్యూ డివిజన్‌లో తహసీల్దార్లకు పోస్టింగ్ ఇవ్వకూడదు. కానీ వేణుగోపాలరావుకు మాత్రం ఇవేమీ వర్తించలేదు. ఆయన సొంత గ్రామం నరసరావుపేట మండలం రావిపాడు. అయినప్పటికీ డిప్యూటేషన్‌పై ఏకంగా నరసరావుపేట తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. వాస్తవానికి వేణుగోపాలరావును గురజాల రెవెన్యూ డివిజన్ దుర్గి తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు.



నరసరావుపేట తహసీల్దార్ వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు, రావిపాడు వాసులు (ఫైల్)

జీతం ఒక చోట.. పనిచేసేది మరోచోట

యడ్లపాడు తహసీల్దార్‌గా ఏవీ రమణను నియమించగా, ఆమె నాదెండ్ల తహసీల్దార్‌గా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. అక్కడ పోస్టింగ్ పడ్డ తహసీల్దార్ జి విజయశ్రీ యడ్లపాడులో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ముప్పాళ్ల, చిలకలూరిపేట తహసీల్దార్‌లుగా పోస్టింగ్ పడ్డ షేక్ మహ్మద్ హుసేన్, ఎం భవానీ శంకర్‌లు సైతం ఒకరి స్థానాల్లో మరొకరు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇలా వీరికి పోస్టింగ్ పడ్డ చోట జీతం తీసుకుంటూ, తమకు అనుకూలమైన మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. రాజకీయంగా కలెక్టర్ కార్యాలయంపై ఒత్తిడి తీసుకు వచ్చి నిషేదం ఉన్నా డిప్యూటేషన్‌పై తహసిల్దార్లను మార్చారు. దీనిపై రెవెన్యూ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

మా వాడు వచ్చాడు.. ఇక మనదే రాజ్యం

సహజంగా ఎవరైనా నూతన అధికారి బాధ్యతలు చేపడితే కార్యాలయ సిబ్బంది, తోటి ఉద్యోగులు వచ్చి శుభాకాంక్షలు చెప్పి వెళుతుంటారు. కానీ వేణుగోపాలరావు నరసరావుపేట తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి ప్రతిరోజూ తెలుగుదేశం పార్టీ నాయకులు, సొంత గ్రామం రావిపాడు వాసులు వచ్చి శుభాకాంక్షలు చెబుతున్నారు. అదేంటంటే వేణు మా వాడే ఇక మనదే రాజ్యం అంటూ కార్యాలయం బయట బహిరంగంగా మాట్లాడుతున్నారు. ప్రభుత్వ తహసీల్దార్ కార్యాలయాన్ని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలా మార్చేశారు. రెవెన్యూ పనులు ఏమున్నా వెంటనే చేసేస్తామని టీడీపీ నేతలు హామీలు ఇచ్చేస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలకు సదరు అధికారి, టీడీపీ నేతల తీరు చూసి విస్తుపోతున్నారు.

పరిపాలన సౌలభ్యం కోసమే...

పరిపాలన సౌలభ్యం కోసమే తహసీల్దార్లు పోస్టింగ్ వేసిన చోటు కాకుండా మరో మండలంలో పనిచేస్తున్నారు. వేతనం మాత్రం పోస్టింగ్ ఉన్న చోటే తీసుకుంటున్నారు. నరసరావుపేట తహసీల్దార్ సొంత మండలంలో పని చేస్తున్నారన్న విషయంపై విచారిస్తాం.

–వినాయకం, డీఆర్వో

ప్రభుత్వ భూమిపై టీడీపీ నేత కన్ను

నరసరావుపేట ప్రజల దాహార్తిని తీర్చే రక్షిత నీటి చెరువు స్థలంపై అధికార పార్టీకి చెందిన ఓ నేత కన్ను పడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా మున్సిపల్ అధికారులు అడ్డుకుని కంచె వేశారు. ఇప్పుడు మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో కంచెను మేసేందుకు సిద్ధమయ్యాడు ఆ నేత.

- గతంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు భూమి ఆక్రమణకు యత్నం
- అడ్డుకుని ఫెన్సింగ్ వేసిన మున్సిపల్ అధికారులు
- మళ్లీ టీడీపీ అధికారంలోకి రావటంతో మరోసారి ప్రయత్నం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: నరసరావుపేట పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకుగాను నకరికల్లు వద్ద సమ్మర్ స్టోరేజి ట్యాంకు నిర్మించాలని నిర్ణయించారు. అప్పటికే అక్కడ 70 నుంచి 80 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. ఆ చెరువు నీటితో గతంలో వందలాది మంది ఇటుక పరిశ్రమ నడుపుతుండగా మరికొంతమంది రైతులు ప్రభుత్వం భూమి ఆక్రమించుకుని సాగు చేసుకొని జీవనం సాగించేవారు. నకరికల్లు చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా మార్చే క్రమంలో మరింత భూమి సేకరణకు అధికారులు సిద్ధమయ్యారు. చెరువుకు చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమిని సేకరించి 260 ఎకరాల విస్తీర్ణంలో సమ్మర్ స్టోరేజి ఏర్పాటు ఏర్పాటుచేశారు. దాని చుట్టూ రివాల్వింగ్ కట్టను ఏర్పాటుచేసి సాగర్‌జలాలను నిల్వ చేసి నరసరావుపేట పట్టణానికి రెండు పూటల తాగునీటిని సరఫరా చేస్తారు. చెరువు నిర్వహణ బాధ్యత నరసరావుపేట మున్సిపాలిటీ వారు చూసుకుంటారు. దీంతో ఇటుక పరిశ్రమదారులు, రైతులు ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోయారు.

గతంలోనూ కబ్జాకు యత్నం

చెరువు కట్టకు ఆనుకొని శివాపురంతండా వెళ్లే రోడ్డు పక్కన గల సుమారు రూ.50లక్షలు విలువచేసే భూమిపై మండల స్థాయి టీడీపీ నాయకుడి కన్ను పడింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రెండున్నర ఎకరాల భూమిని ఆక్రమించి సాగుభూమిగా మలుచుకున్నాడు. అప్పట్లో గుర్తించిన మున్సిపల్ అధికారులు ఆక్రమించుకున్న భూమిని స్వాధీనం చేసుకొని చుట్టూ కంచె వేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నంతకాలం మిన్నకుండిపోయిన ఆ నాయకుడు తిరిగి తమ పార్టీ అధికారంలోకి రావటంతో తిరిగి సదరు భూమిని ఆక్రమించుకునేందుకు వేగంగా పావులు కదుపుతున్నాడు. పట్టపగలే పొక్లెయిన్‌తో చెట్లను తొలగించి జంగిల్ క్లియరెన్స్ చేసి అక్రమంగా సాగు చేసుకునేందుకు చకచకా పనులు చేపడుతున్నాడు.

నా దృష్టికి రాలేదు

ఈ విషయం ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. వెంటనే తమ అధికారులు పరిశీలించి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటారు.

–సి.రవిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్



భూమిలో పిచ్చిచెట్లను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న దృశ్యం

ప్రతిభకు ప్రోత్సాహం

- ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు సెప్టెంబర్ 6 చివరి తేదీ
- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12 వేలు
- ఈ ఏడాది డిసెంబర్ 8న రాత పరీక్ష
- జిల్లాలో 31,996 మంది 8వ తరగతి విద్యార్థులు

సత్తెనపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ప్రతిభగల పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) అందజేస్తోంది. ఇందుకోసం ప్రతి ఏటా పరీక్ష నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో ప్రతిభ చూపి ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యేంత వరకూ ఏటా ఈ ఆర్థిక ప్రోత్సాహం అందుతుంది. ఎక్కువ మంది ఈ పరీక్ష రాసేలా మండల విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం..

దరఖాస్తుల స్వీకరణ ఈ ఏడాది ఆగస్టు 5వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఎనిమిదో తరగతి విద్యార్థుల నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. పరీక్షా రుసుం చెల్లించడానికి సెప్టెంబర్ 10వ తేదీ వరకు గడువు ఉంటుంది. డిసెంబర్ 8న పరీక్ష నిర్వహిస్తారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే రూ.50 చొప్పున ఫీజు ఆన్‌లైన్‌లో సూచించిన ఎస్‌బీఐ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

అర్హతలు తప్పనిసరి...

జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 31,996 మంది ఉన్నారు. ఈ ప్రోత్సాహకాలకు ఏడో తరగతిలో కనీసం 55 శాతం మార్కులు, తుది ఎంపిక సమయం నాటికి ఎనిమిదో తరగతిలో 55 శాతం మార్కులు పొందిన వారు అర్హులు. కుటుంబ వార్షికాదాయం ఏడాదికి రూ.3.50 లక్షలకు మించకూడదు.



సుగాలీ కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 8వ తరగతి విద్యార్థులు

ఉన్నత విద్యకు దోహదం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకం పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఎంత దోహదపడుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఏటా ఈ పథకానికి ఎంపిక అవుతున్నారు. ఈ పరీక్ష గురించి మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేస్తున్నారు. ఎక్కువమంది దరఖాస్తు చేసుకొని ప్రతిభ చూపాల్సిన అవసరం ఉంది. ఈ పరీక్షల్లో ప్రతిభ చూపితే నాలుగేళ్లపాటు ఆర్థిక వెసులు బాటు కలుగుతుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

–ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి, పల్నాడు

ఆటే ఆయన శ్వాస..ధ్యాస

- యువత క్రీడలవైపు మొగ్గు చూపేలా కృషి
- దాతల సహకారంతో క్రీడా ప్రాంగణాలు అభివృద్ధి
- 25 మందిని వ్యాయామ ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన ఘనత
- 30 మంది జాతీయ, 40 మంది రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా ఎదిగారు
- వ్యాయామ పుస్తక రచయితగా ప్రభుత్వం తరపున ఎంపిక
- క్రీడలకు చేయూత ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు

పెదకూరపాడు: నేటి సమాజంలో యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారు. వారి దృష్టిని క్రీడల వైపు మళ్లించేందుకు ఆ ఉపాధ్యాయుడు నిరతంరం కృషి చేస్తూనే ఉన్నాడు. ఎక్కడ పనిచేసిన అక్కడ క్రీడా కారులను తయారుచేసి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు పంపుతున్నారు. దాతల సహకారంతో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసి క్రీడాకారులను తయారుచేస్తున్నారు. వ్యాయామ విద్యను ప్రోత్సహించేందుకు పుస్తకాలు తయారు చేస్తూ తన వంతు కృషి చేస్తున్నారు. జాతీయ క్రీడాకారుల జీవిత విశేషాలు తెలియజేసేందుకు అనేక సభలు, సమావేశాలు నిర్వహించారు. మరో పక్క దేశం కోసం క్రీడాకారులకు మద్దతుగా ప్రదర్శనలు, ఉత్సవాలు నిర్వహించి గ్రామీణ క్రీడాకారుల మన్నలు పొందుతున్నారు పెదకూరపాడు జిల్లా పరిషత్ వ్యాయామ ఉపాధ్యాయుడు చోడుబోయిన వెంకట నాగరాజు.



నాగరాజును భుజాలపై ఎక్కించుకొని ఊరేగిస్తున్న క్రీడాకారులు(ఫైల్)

క్రీడల అభివృద్ధికి కృషి

పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన నాగరాజు స్థానిక మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యను అభ్యసించారు. మొదటి నుండి క్రికెట్ క్రీడలో రాణించారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం తరపున క్రికెట్‌లో ఆంధ్ర సెంట్రల్ జోన్‌లో పాల్గొని రాణించారు. అనంతరం 2003లో డీఎస్సీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఎంపికై దుర్గి మండలం ముటూకూరు జెడ్పీ పాఠశాలలో పనిచేశారు. అక్కడ క్రీడాభివృద్ధికి కృషి చేశారు. ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు మాచర్ల సుధాకర్, అనిల్, వెంకట్ రాజులు నాగరాజు శిక్షణలో ఎదిగి పీఈటీలుగా ఉద్యోగాలు సాధించారు. అనంతరం తాను విద్యను అభ్యసించిన పిడుగురాళ్ల, జానపాడు పాఠశాలకు పీఈటీగా పనిచేశారు. ఇక్కడ పల్నాడు స్థాయి జోనల్ పోటీల్లో ఖోఖో, వాలీబాల్‌ల్లో మూడుసార్లు చాంపియన్స్‌గా పిడుగురాళ్ల పాఠశాలను నిలిపారు. ఇక్కడ విద్యనభ్యసించిన విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయిలో ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్‌లో రాణించారు. ఇదే పాఠశాలలో విద్యనభ్యసించిన అజయ్, శ్రీకాంత్, రసూల్, కళ్యాణ్‌లు పీఈటీలుగా ఎంపికయ్యారు. పెదకూరపాడులో పీఈటిగా పనిచేస్తూనే రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో అండర్-14, అండర్ -17 బాలిక విభాగంలో హారిక, ఆసిఫా, తపస్సు, పెద్ద ఆసిఫాలు ఎంపికై రాణించారు.

క్రీడలకు చేయూత

- రాష్ట్ర ప్రభుత్వం తరుపున వ్యాయామ విద్యను ప్రోత్సహించేందుకు వ్యాయామ అక్షరాసత్య, క్రీడల పేరుతో లెవల్-1, లెవల్-2, లెవెల్-3 పుస్తకాలు, కరదీపికలు, ఆనంద వేదిక లాంటి పుస్తకాలు రచించారు.
- ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు 30 మంది జాతీయ, 40 మంది రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు.
- వేసవి శిక్షణ తరగతులను నిర్వహించడంలో నాగరాజు కీలకప్రాత పోషించారు.
- పాఠశాలలో క్రీడా మైదానం ఏర్పాటు చేసి, విద్యార్థులకు దాత నుంచి క్రీడా దుస్తులు, పరికరాలు ఇప్పించేవారు.

క్రీడలే కూడు పెడుతున్నాయి.



చిన్నతనంలో ఆటలు ఆడుతుంటే ఆటలేమన్నా కూడు పెడతాయా అనేవారు పెద్దలు. అవును క్రీడలే నాకు కూడు పెడుతున్నాయి. క్రీడలపై ఆసక్తితో మంచి వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా. క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రెండు శాతం రిజర్వేషన్ ఉంటుంది. క్రీడల్లో రాణించే వారికి భవిష్యత్ ఉంటుంది. నాగరాజు మాస్టర్ శిక్షణలో నేను మంచి క్రీడాకారుడిగా నిలిచాను.

–షేక్ రసూల్, పీఈటీ, పిడుగురాళ్ల

క్రీడలపై నాకు ఆసక్తిని పెంచారు



మొదట నాకు క్రీడలపై ఆసక్తి ఉండేది కాదు. నాలో ఉన్న ప్రతిభను గుర్తించి మా వ్యాయామ ఉపాధ్యాయులు నాకు క్రీడపై ఆసక్తిని పెంచారు. ఖోఖో, వాలీబాల్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాను. బీకాం, బీపీఈడీగా విద్య అభ్యసించాను. ఇప్పుడు పిడుగురాళ్ల పట్టణంలో పీఈటీగా ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్నాను.

–కుక్కమళ్ల నాగరాజు, పీఈటీ, హైదరాబాద్

క్రీడల అభివృద్ధికి సహకారం అవసరం



యువతలో క్రీడలపై ఆసక్తి ఉంది. వారిలో ప్రతిభను పెద్దలు గుర్తించాలి. క్రీడల అభివృద్ధికి దాతలతోపాటు, పాలకుల సహకారం అవసరం. భవిష్యత్‌లో క్రీడాకారులను తయారుచేసేందుకు మరింత బాధ్యతగా కృషి చేస్తా.

–సీహెచ్ నాగరాజు, పీఈటీ, పెదకూరపాడు.

రాష్ట్ర ప్రభుత్వం అండతోనే అర్ధరాత్రి దాడి

- అంబేడ్కర్ స్మృతివనంలో శిలాఫలకం ధ్వంసం
- రాజ్యాంగ నిర్మాతను అపహాస్యం చేసిన టీడీపీ
- వైఎస్ జగన్ పేరు యథాతథంగా పెట్టేవరకు ఉద్యమం
- మాజీ మంత్రి అంబటి రాంబాబు వెల్లడి
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

పట్నంబజారు: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండదండలతోనే విజయవాడ నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్మృతివనంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేరు ఉన్న శిలాఫలకాన్ని అర్ధరాత్రి ధ్వంసం చేశారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. వై.ఎస్.జగన్ పేరు ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. శంకర్‌విలాస్ సెంటర్‌లో ప్రారంభమైన ఈ ప్రదర్శన అరండల్‌పేట పోలీసుస్టేషన్ మీదుగా లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగింది. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

వైఎస్ జగన్‌కు ఆదరణ తగ్గించలేరు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహంపై ఉన్న వై.ఎస్.జగన్ పేరును దుర్మార్గంగా తొలగించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ నేతలు మేకతోటి దయాసాగర్, నిమ్మకాయల రాజనారాయణ, ఎం.పురుషోత్తం, బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం

ఫ్యాక్టరీ యాజమాన్యం, గ్రామస్తులతో బాపట్ల జేసీ సుబ్బారావు సమావేశం

మేదరమెట్ల: గ్రామంలోకి కారం కోరు రాకుండా నెల రోజుల్లో తగిన పరిష్కారం చేస్తామని సింథైట్ ఫ్యాక్టరీ నిర్వాహకులు హామీ ఇచ్చారు. బాపట్ల జిల్లా కొరిశపాడు మండల కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సుబ్బారావు శనివారం గ్రామస్తులు, ఫ్యాక్టరీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నెల రోజుల్లో ఫ్యాక్టరీ నుంచి కారం కోరు బయటకు రాకుండా చూస్తామని ఫ్యాక్టరీ నిర్వాహకులు చెప్పినట్లు జేసీ తెలిపారు. చెప్పిన గడువు తరువాత కోరు వస్తే ఫ్యాక్టరీని మూసి వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఫ్యాక్టరీ నిర్వాహకులు తెలియజేశారన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల తమ్మవరం రోడ్డు సమీపంలో గల సింథైట్ కారం ఫ్యాక్టరీ నుంచి కొన్ని నెలలుగా కారం కోరు వస్తుందని, దీనివలన గ్రామ ప్రజలు పరిసర ప్రాంతాల ప్రజానీకం ఇబ్బందులు పడుతున్న విషయం విదితమే. సమావేశంలో ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఫ్యాక్టరీ డీజీఎం మహేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ సుబ్బారావు

విష సంస్కృతిని ముక్తకంఠంతో ఖండించాలి

- రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి
- కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం గాడి తప్పింది
- అంబేడ్కర్ మహాశిల్పంపై దాడిని ఖండించిన మాజీ ఎమ్మెల్యే శంకరరావు


మాట్లాడుతున్న నంబూరు శంకరరావు

పెదకూరపాడు: కూటమి ప్రభుత్వం గతంలో ఎన్నడూలేని విష సంస్కృతిని అవలంభిస్తుందని ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో దీన్ని ఖండించాలని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవాడలోని భారతరాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. తమకు అనుకూలంగా లేనివారిపై దాడులు చేయిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం శాంతి భద్రతలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి, సంక్షేమం చేసి ప్రజల మన్ననలు పొందాలి కానీ దాడులు చేయడం, గత ప్రభుత్వం హాయంలో చేసిన అభివృద్ధికి సంబంధించి శిలఫలాలు, సచివాలయాలు ధ్వంసం చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో పత్రి గ్రామంలో రోడ్లు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, కమ్యూనిటీ హాల్‌లు ఏర్పాటు చేసి అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విష సంస్కృతిని విడనాడి అభివృద్ధి, సంక్షేమం వైపు అడుగులు వేయాలని సూచించారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయాలని చూస్తున్నారు...

మాచర్ల: విజయవాడలో సామాజిక న్యాయ మహాశిల్పమైన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం శిలాఫలాకాన్ని ధ్వంసం చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు మేరాజోతు హనుమంతునాయక్ విమర్శించారు. శనివారం పట్టణంలోని పార్కు సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను అవమానించేలా కూటమి నేతలు వ్యవహరించడం దారుణమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూ.400 కోట్లతో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మహా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే, దాన్ని ధ్వంసం చేయాలని కుట్ర చేయడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలంతా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించాలన్నారు. కూటమి ప్రభుత్వం దళితులపై పక్షపాతి వైఖరి చూపుతోందన్నారు. ఇలాంటి చర్యల వల్ల కూటమి ప్రభుత్వం ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మహాశిల్పం ధ్వంసం రాజద్రోహమే

సత్తెనపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని, శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం రాజద్రోహమని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్ అన్నారు. విజయవాడ స్వరాజ్ మైదాన్‌లో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడాన్ని నిరసిస్తూ శనివారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. దీనికి కారకులైన వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయవాడకు వన్నె తెచ్చేలా భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలనే ఉద్దేశంతో రూ.440 కోట్లతో ప్రపంచంలోనే అతిపెద్దదైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. భారతదేశానికే గర్వకారణంగా అంబేడ్కర్ స్మృతివనాన్ని నెలకొల్పారన్నారు. అంబేడ్కర్ మహా శిల్పంపై దాడి క్షమించరానిదన్నారు. కూటమి ప్రభుత్వంలో అంబేడ్కర్ విగ్రహానికే రక్షణ కరువైందని, దళితుల ఆరాధ్య దైవమైన అంబేడ్కర్ విగ్రహాన్ని లక్ష్యంగా చేసుకొని కొంత మంది ఉన్మాదంతో చెలరేగి పోవడం క్షమించరాని నేరమన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకునేలా దళితులతో పాటు అన్నివర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత పట్టణంలోని క్రిస్టియన్ పేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రధాన రహదారిలో కొవ్వొత్తుల ప్రదర్శన చేసుకుంటూ తిరిగి తాలూకా సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకొని నిరసన చేపట్టారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దావులూరి కోటేశ్వరరావు, బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు రాజవరపు శివనాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు జూపల్లి పాల్, పెద్దింటి నాగేశ్వరరావు, గుంటూరు జానీ, నందిగం యల్లమంద, భట్లూరు కోటేశ్వరరావు, కాశిమాల ఓబయ్య, ఏకుల మత్తయ్య, పల్లె గాబ్రియేలు, జంగాల సంపత్, గుజ్జర్లపూడి చంటి, జడా ప్రసాద్, సందెపోగు గాంధీ, దార్ల ఏడు కొండలు, కాటుమాల డేవిడ్ తదితరులు ఉన్నారు.



సత్తెనపల్లిలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాసంఘాల నేతలు

నిందితులపై అట్రాసిటీ కేసు పెట్టాలి

సత్తెనపల్లి డీఎస్పీకి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అధ్యక్షుడు గార్లపాటి దాసు ఫిర్యాదు


సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబుకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న గార్లపాటి దాసు, సభ్యులు

క్రోసూరు: విజయవాడలోని స్వరాజ్‌మైదానంలో గల భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై ఈనెల 8వ తేదీన దాడిచేసిన వారిని అరెస్ట్ చేసి, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబును శనివారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అధ్యక్షుడు గార్లపాటి దాసు, సభ్యులు కోరారు. ఈమేరకు ఆయనకు ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సంఘటనపై అధికార కూటమి ప్రభుత్వం సీబీసీఐడీచే విచారణ చేపట్టాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అదే విధంగా రాష్ట్రంలోని అంబేడ్కర్ విగ్రహాల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. సీహెచ్ భాస్కరరావు, కంచర్ల అచ్యుతరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



నరసరావుపేటరూరల్: కారు ఢీ కొనడంతో బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని గురవాయపాలెం వద్ద చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురవాయపాలెంకు చెందిన ఈర్ల లక్ష్మీ చరణ్‌సాయి(9) రెండవ తరగతి చదువుతున్నాడు. రెండో శనివారం సెలవురోజు కావడంతో ఇంటివద్దే ఉన్న చరణ్‌సాయి ఆడుకునేందుకు బయటకు వెళ్లాడు. బీసీ కాలనీ సమీపంలో రోడ్డు దాటుతుండగా కోటప్పకొండ నుంచి నరసరావుపేట వైపు వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ కిశోర్ తెలిపారు.

గర్భిణులు 108 సేవలను వినియోగించుకోవాలి

మాతృ మరణాలపై జేసీ సూరజ్ సమీక్ష



నరసరావుపేట: గర్భిణులు ప్రసవ సమయంలో 108 అంబులెన్స్‌లు ఉపయోగించుకోవాలని, వారితో వైద్య సిబ్బంది వెళ్లాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మాతృమరణాలపై వైద్యఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మాతృ మరణాలు నివారించేందుకు ఏఎన్‌ఎంలు తమ పరిధిలోని గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించి హైరిస్క్‌వారికి ప్రత్యేక సంరక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే హాస్పిటళ్లలో మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి, డీసీహెచ్‌ఎస్, జిల్లాలోని యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యాధికారులు, నరసరావుపేట, సత్తెనపల్లి, విజయపురిసౌత్, మాచర్ల, గురజాల సూపరిండెంట్లు, గైనకాలజిస్టులు, కమిటీ సభ్యులైన ఎన్‌ఆర్‌ఐ మంగళగిరి, షిరిడీ సాయి ఆర్థోపెడిక్, వినుకొండ మెటర్నిటీ హాస్పిటల్, గుంటూరు సురక్ష హాస్పిటల్, నరసరావుపేట ఝాన్సిలక్ష్మీ, శ్రీ దత్తా హాస్పిటళ్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వెల్లటూరు గుడ్‌షెపర్డ్ పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఇన్నారెడ్డి టోర్నమెంట్‌ను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మొదటి రోజు 13 జిల్లాల నుంచి 15 మహిళా జట్లు పాల్గొనగా వీరిలో విజయనగరం, గుంటూరు, కడప, అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, కృష్ణ, విజయనగరం జట్లు గెలుపొందాయి. పురుషుల విభాగంలో 15 జట్లు పాల్గొనగా అనంతపురం, వెస్ట్ గోదావరి, ఈస్ట్ గోదావరి, నెల్లూరు, కడప జట్లు గెలుపొందాయి. మొత్తం 30 జట్లు పోటీ పడుతున్నాయని, ఇక్కడ గెలుపొందిన వారిలో నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి మహారాష్ట్రలో జరిగే జాతీయ పోటీలకు పంపడం జరుగుతుందని సాఫ్ట్ బాల్ ఉమ్మడి గుంటూరు జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ నరసింహారెడ్డి తెలిపారు. అన్ని వసతులు కల్పించి సహకరిస్తున్న గుడ్‌షెపర్డ్ పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఇన్నారెడ్డి యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పీడీలు చిరంజీవి, సురేష్, రాధాకృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

300 కిలోల గంజాయి పట్టివేత

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజ టోల్‌గేట్ వద్ద సెబ్ పోలీసులు 300 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సెబ్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నం నుంచి గంజాయి రవాణా అవుతోందనే సమాచారం మేరకు టోల్‌గేట్ వద్ద నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తనిఖీలు చేపట్టగా శుక్రవారం ఉదయం 80, రాత్రి 220 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రెండు కార్లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంగిరెడ్డిపాలెంలో ప్రబలిన డయేరియా

ఆసుపత్రుల పాలైన తొమ్మిదిమంది ఎస్సీ కాలనీ వాసులు


చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

మాచవరం: మండలంలోని గంగిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీలో డయేరియా ప్రబలడంతో తొమ్మిది మంది ఆసుపత్రుల పాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుంటగాని బుజ్జి వాంతులు, విరేచనాలతో నాలుగు రోజుల క్రితం పీహెచ్‌సీలో చేరి చికిత్స పొందుతుంది. రెండు రోజుల క్రితం గుంటగాని కాంతమ్మ, పోతిపోగు చరణ్య, నవీన్‌కుమార్, నందిపాటి చంటి, సాగర్‌లు వాంతులు విరేచనాలతో పీహెచ్‌సీలో చేరారు. వీరితో పాటు పోతిపోగు కోటమ్మ, గుంటగాని యాకోబు, గల్లా రాశిలు తీవ్ర అనారోగ్యానికి గురికాగా మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డయేరియా తీవ్రం కావడంతో గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఇంటింటి సర్వే చేపట్టి ముందు జాగ్రత్త చర్యగా మందులు అందించారు. కాలనీలో సరైన సైడ్ కాల్వలు లేకపోవడం, డ్రైనేజీ నీటి వద్ద ఉన్న మినీ వాటర్‌ట్యాంక్ నీటిని మంచి నీరుగా ఉపయోగించడం వలన వ్యాధిబారిన పడినట్లు స్థానికులు తెలిపారు.

రసవత్తరంగా అనంతపురం-ప్రకాశం మ్యాచ్

- నరసరావుపేటలో అండర్-19 అంతర్‌జిల్లాల క్రికెట్ పోటీలు
- 135 పరుగులు సాధించిన ప్రకాశం బ్యాట్స్‌మెన్ ఆనంద్


కె.ఆనంద్ 135 పరుగులు


హనీష్ వీరారెడ్డి 4 వికెట్లు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో అండర్-19 అంతర్‌జిల్లాల క్రికెట్ పోటీల్లో భాగంగా అనంతపురం, ప్రకాశం జిల్లా జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ రసకందాయంలో పడింది. టాస్ గెలిచిన అనంతపురం జట్టు మొదటి రోజు తన తొలి ఇన్నింగ్స్‌లో 324 పరుగులు చేయగా, ప్రకాశం జట్టు శుక్రవారం ఒక వికెట్ కోల్పోయి ఆరు పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో శనివారం బ్యాటింగ్ ప్రారంభించి 284 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ప్రకాశం బ్యాట్స్‌మెన్‌లు కె. ఆనంద్ 127 బంతుల్లో 135 పరుగులు సాధించాడు. ఎస్.అఖిల్ 76 బంతుల్లో 48 పరుగులు సాధించాడు. అనంతపురం బౌలర్‌లు హనీష్ వీరారెడ్డి 4 వికెట్లు, ప్రదీప్‌రెడ్డి 4 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి రెండవ ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసింది. అనంతపురం జట్టుకు 105 పరుగుల ఆధిక్యత లభించినట్లయింది. ఆదివారం మూడో రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

రణక్షేత్రంలో పల్నాటి వీరాచారుల కొలుపులు

- కారెంపూడి తరలివచ్చిన ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు గ్రామాల వీరాచారవంతులు
- చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మకు ప్రత్యేక పూజలు


చెన్నకేశవస్వామి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న వీరాచారవంతులు

కారెంపూడి: రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన పల్నాటి వీరాచారవంతులు తమ పల్నాటి వీరుల కొణతాలకు శనివారం పల్నాటి రణక్షేత్రమైన కారెంపూడిలో కొలుపులు నిర్వహించారు. గత మూడు రోజులుగా వివిధ రకాల క్రతువులను పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, పల్నాటి వీరాచార పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయుధాలకు చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మ, ఉగ్రనరసింహస్వామి యంత్ర పూజలు చేయించారు. జలాధివాసం, ధాన్యధివాసం, శయ్యాధివాసం కార్యక్రమాల అనంతరం శనివారం అంకాలమ్మ, చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి కొలుపులు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం దగ్గర మాకుమామిడి గ్రామం నుంచి 35 కుటుంబాలు, సత్తెనపల్లి దగ్గర కొండూరు నుంచి 45 మంది, వినుకొండ దగ్గర నాగులవరం నుంచి, ప్రకాశం జిల్లా నిడమానూరు ప్రాంతాల నుంచి పల్నాటి వీరాచారవంతులు కారెంపూడి తరలివచ్చి తమ ఇలవేల్పులుగా కొలుచుకునే పల్నాటి వీరుల ఆయుధాలకు యంత్ర ప్రతిష్ఠ చేయించుకున్నారు. అనివార్య కారణాల వల్ల వీరంతా పల్నాటి వీరుల ఉత్సవాలలో పాల్గొని తమ పూర్వీకులను స్మరించుకునే కార్యక్రమాలను గత కొన్నేళ్లుగా నిర్వహించలేక తమకు దగ్గరలోని చెన్నకేశవస్వామి, వీర్లంకమ్మ తల్లి దేవాయాలల్లో ఇంతకాలం క్రతువులు నిర్వహించుకున్నారు. అయితే కారెంపూడి వెళ్లి అంకాలమ్మ తల్లి, చెన్నకేశవస్వామిని దర్శించుకుని తప్పక పూజలు చేయాలని ప్రబలమైన కోరికతో ఇక్కడకు వచ్చి పల్నాటి వీరాచార కార్యక్రమాలను నిర్వహించారు. తామంతా వ్యయ ప్రయాసలకోర్చి పల్నాటి రణక్షేత్రంలో కొలుపులు చేయడం జరిగిందని ఆచారవంతులు పేర్కొన్నారు.

జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ కోచింగ్ క్యాంపు ప్రారంభం


క్యాంపును ప్రారంభిస్తున్న సిస్టర్ సుజాత, పక్కన ఉపాధ్యాయులు

మాచర్ల: పట్టణంలోని సెయింట్‌ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణంలో జిల్లాస్థాయి సాఫ్ట్ బాల్ కోచింగ్ క్యాంపును ప్రిన్సిపాల్ సిస్టర్ సుజాత శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ క్యాంపు వారం రోజులు పాటు జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయి కోచ్ పుచ్చకాయల బాలకృష్ణ పర్యవేక్షణలో వారంరోజులు క్యాంపు నిర్వహించడం జరుగుతోందన్నారు. పాఠశాల పీడీ కుమార్, మణికంత, ప్రతాప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్రికన్ వైద్యనిపుణులకు మోకీలు మార్పిడిపై శిక్షణ


అంగోల వైద్య, ఆరోగ్యశాఖ మంత్రితో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి


ఆపరేషన్ చేయించుకున్న రోగి, వారి బంధువులతో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అరుదైన ఘనతను సాధించారు. విదేశాల్లో మోకీలు మార్పిడి ఆపరేషన్లు స్వయంగా చేసి విదేశీయులకు గుంటూరులో ఈ తరహా సర్జరీలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్‌లకు ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన శనివారం మీడియాకు వెల్లడించారు. ఆఫ్రికన్ దేశాలలో అత్యంత వెనుకబడిన అంగోలాలో వారం రోజులు పర్యటించినట్లు చెప్పారు. అంగోల దేశ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సిల్వియా పొల లుటుకుట ఆహ్వానం మేరకు ఆ దేశంలోనే తొలిసారిగా రివిజన్ నీ రీప్లేస్మెంట్ సర్జరీ నిర్వహించామన్నారు. నాలుగు రోజులపాటు అక్కడి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్లకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. వారి సూచన మేరకు యువ వైద్యులకు గుంటూరులోని సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో మోకీలు, తుంటి మార్పిడి ఆపరేషన్‌లపై శిక్షణ ఇవ్వనున్నామని వెల్లడించారు. ఈ మేరకు ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్ సొసైటీలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. రానున్న కాలంలో రివిజన్ నీ రీప్లేస్మెంట్ సర్జరీలకు రాజధాని అమరావతి కేంద్ర బిందువుగా మారనుందని డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి వెల్లడించారు.